అట్టుడికిన బెంగాల్

- ఛాత్ర సమాజ్ 'నబన్న అభిజన్' ర్యాలీ తీవ్ర ఉద్రిక్తం
- ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై కోల్‌కతాలో సచివాలయ ముట్టడికి విద్యార్థుల యత్నం
- సీఎం మమత బెనర్జీ రాజీనామాకు డిమాండ్
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు
- జలఫిరంగులు, బాష్పవాయువు గోళాలు ప్రయోగం
- పోలీసులపైకి రాళ్లు రువ్విన నిరసనకారులు
- కోల్‌కతాలో రోజంతా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- నేడు పశ్చిమ బెంగాల్ బంద్‌కు బీజేపీ పిలుపు
- మమతకు పాలీగ్రాఫ్ టెస్ట్ చేయాలని డిమాండ్

కోల్‌కతా, ఆగస్టు 27: పశ్చిమ బెంగాల్ భగ్గుమంది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'నబన్న అభిజన్' ర్యాలీ పేరుతో పశ్చిమ్ బంగా ఛాత్ర సమాజ్ అనే విద్యార్థి సంఘం చేపట్టిన సచివాలయ ముట్టడి కార్యక్రమం హింసాత్మకంగా మారింది. పోలీసులు – నిరసనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఇరువైపులా అనేకమంది గాయాలపాలయ్యారు. మరోవైపు డీఏ పెంచాలనే డిమాండ్‌తో సంగ్రామి జౌత మంచ అనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సైతం సచివాలయానికి ర్యాలీ నిర్వహించాలనుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కోల్‌కతాలో ముందుజాగ్రత్తగా 4 వేల మందితో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది.

12 గంటల బంద్‌కు బీజేపీ పిలుపు

పోలీసుల చర్యలకు నిరసనగా బుధవారం 12 గంటల పాటు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకంత మజుందర్ పిలుపునిచ్చారు. విద్యార్థులపై దాడులను పోలీసులు ఆపకపోతే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని ప్రతిపక్ష నేత సువేందు అధికారి హెచ్చరించారు. నియంతలా ప్రవర్తిస్తున్న మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనలో ప్రమేయం ఉన్న వారిని మమతా బెనర్జీ కాపాడుతున్నారని, ఆమెకు, కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష చేస్తే నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు.

ఛాత్ర సమాజ్ కార్యకర్తలపై లాఠీచార్జి చేస్తున్న ఆర్‌పీఎఫ్, పోలీసులు

పోలీసుల లాఠీచార్జి.. రాళ్లు రువ్విన నిరసనకారులు

సచివాలయానికి వెళ్లేందుకు మంగళవారం ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు వేర్వేరుగా ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటుచేసి వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో హౌరా బ్రిడ్జి వద్ద, సంత్రగచ్చి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు – నిరసనకారులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, జలఫిరంగులు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. పోలీసులపైకి నిరసనకారులు రాళ్లురువ్వారు. తర్వాత ఎంజీ రోడ్డు, హస్టింగ్స్ రోడ్డులోనూ ఘర్షణలు తలెత్తాయి. ఇరువైపులా అనేక మంది గాయపడ్డారు. ఘర్షణలతో రోజంతా కోల్‌కతాలో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి.

'అమ్మ'కు మోహన్ లాల్ రాజీనామా

మలయాళ చిత్ర పరిశ్రమలో మీటూ ప్రకంపనలు

కొచ్చి: జస్టిస్ హేమ కమిటీ నివేదిక మాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. మలయాళం సినీ పరిశ్రమలో లైంగిక వేధింపుల గురించి అనేక అంశాలు బయటపడటంతో ప్రముఖులంతా రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా మలయాళీ సినీ కళాకారుల సంఘం (అమ్మ) అధ్యక్షుడు మోహన్ లాల్ సహా ఆఫీస్ బేరర్లం దరూ మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు 'అమ్మ' ఓ ప్రకటనను విడుదల చేసింది. కొందరు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అన్ని రకాల మీడియాలలోనూ వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ వీరంతా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. నూతన పాలక మండలిని రెండు నెలల్లోగా ఎన్నుకోనున్నట్లు తెలిపింది. రాజీనామా చేసిన పాలక మండలి తాత్కాలికంగా బాధ్యతలను నిర్వహిస్తుందని వివరించింది. అంతకుముందు మోహన్ లాల్ ఈ సంఘం కార్యవర్గ సభ్యులందరితోనూ ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలుస్తున్నది.

లైంగిక హింస కేసుల్లో సత్వర న్యాయం అందించాలి

మహిళా హక్కుల సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ: వరుసగా జరుగుతున్న లైంగిక నేరాల కేసులు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న సమయంలో సత్వర న్యాయం కోసం మహిళా సంఘాలు గళమెత్తాయి. లైంగిక నేరాలను అంతం చేయాలని డిమాండ్ చేశాయి. కోల్‌కతా, మణిపూర్, గుజరాత్, ఉత్తరాఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్‌లలో జరిగిన సంఘటనలు దేశంలో మహిళల భద్రతకు ఉన్న ముప్పును గుర్తు చేస్తున్నాయని 35 మహిళా సంఘాలు మంగళవారం విడుదల చేసిన స్టేట్‌మెంట్‌లో ఆరోపించాయి. కోల్‌కతా డాక్టర్‌పై హత్యాచారం కేసును తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి మమత బెనర్జీ ప్రభుత్వం ప్రయత్నించిందని దుయ్యబట్టాయి. నేరాలపై దర్యాప్తు చేసే యంత్రాంగాన్ని పటిష్టం చేయాలని, పరిపాలన, దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశాయి.

స్క్రాపేజ్ సర్టిఫికెట్‌తో వాహనాలపై డిస్కౌంట్!

ఆటోమొబైల్ సంస్థల ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 27: వచ్చే పండుగ సీజన్ కంటే ముందుగానే ఆటోమొబైల్ సంస్థలు కొనుగోలుదారులకు శుభవార్తను అందించాయి. పలు ప్యాసింజర్ అండ్ కమర్షియల్ వాహనాల తయారీ సంస్థలు స్క్రాపేజ్ సర్టిఫికెట్‌తో తమ వాహనాలపై 1.5 శాతం నుంచి 3 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించాయి. పాత వాహనాలు ఇచ్చి కొత్త వాహనాలు కొనుగోలు చేసేవారికి ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం అనంతరం పలు ఆటోమొబైల్ సంస్థలు ప్రకటించాయి. దీంట్లో భాగంగా జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఏకంగా రూ.25 వేల రాయితీని ప్రకటించింది. దేశీయ ఆటోమొబైల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన సమావేశానికి దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. కమర్షియల్ వాహన తయారీదారులు.. రెండేండ్లపాటు రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించగా, ప్యాసింజర్ వాహన సంస్థలు అయితే స్వల్పకాలం మాత్రమే అంటే ఏడాది వరకు ఈ ప్రయోజనాలను కల్పించనున్నట్లు పేర్కొంది. వీటిలో కార్ల తయారీ దిగ్గజాలైన మారుతి సుజుకీ, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్ మోటర్, కియా మోటర్స్, టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్, రెనో, నిస్సాన్, స్కోడా ఇండియా సంస్థలు షోరూం ధరలో 1.5 శాతం లేదా రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ప్రకటించాయి.

వాహన స్థితి ఆధారంగా..

వాహన స్థితి ఆధారంగా అదనంగా డిస్కౌంట్ ఇచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని ఆటోమొబైల్ వర్గాలు వెల్లడించాయి. ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు తమకు నచ్చిన మాడళ్లకు మాత్రమే ఈ రాయితీ వర్తింపు చేసుకునే అవకాశాలను కూడా కల్పించింది. పాత కార్ల స్థానంలో ఎక్స్ఛేంజ్ కింద కొత్త కార్లను కొనుగోలు చేసేవారికి ఈ ప్రయోజనాలు పొందవచ్చును.

దవాఖానలో మైనర్‌పై గ్యాంగ్‌రేప్

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో దారుణం

జోధ్‌పూర్: దేశంలో మైనర్లు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయి. తాజాగా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో 15 ఏండ్ల బాలికపై ఇద్దరు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు ఈ నెల 25న కుటుంబ సభ్యులతో గొడవపడి, ఎవరికీ తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మహాత్మా గాంధీ ప్రభుత్వ దవాఖానలో ఆమె రాత్రి సమయంలో ఒంటరిగా కనిపించడంతో ఇద్దరు వ్యక్తులు ఆమెను ప్రలోభపెట్టారు. దవాఖానలోని బయో-మెడికల్ వ్యర్థాల సెక్షన్‌వైపు తీసుకెళ్లి, సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అంతకుముందు ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం ఆమెను దవాఖాన ప్రాంగణంలో గుర్తించారు. ఆమె తీవ్ర ఆందోళనతో కనిపించింది. ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆమెపై గ్యాంగ్ రేప్ జరిగినట్లు కేసు నమోదు చేశారు. ఆమెకు వైద్య పరీక్షలు చేయించారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని, ప్రశ్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఒకడు గతంలో ఈ దవాఖానలో పని చేసినట్లు అధికారులు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

మత్తు నీళ్లు తాగించి లైంగికదాడి.. మహారాష్ట్రలో మరో ఘోరం

ముంబై, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): మహిళలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న వేళ సోమవారం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ఓ ఆటో డ్రైవర్ ఓ నర్సింగ్ విద్యార్థిని(19)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఇంటికి వెళ్లడానికి ఆటో ఎక్కిన బాధితురాలిని నీళ్లు తాగమని డ్రైవర్ కోరాడు. నీళ్లలో మత్తు మందు కలిపి ఉండటంతో అవి తాగిన తర్వాత ఆమె స్పృహ కోల్పోయింది. అనంతరం ఆటో డ్రైవర్ ఆమెను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్పృహ వచ్చిన తర్వాత బాధితురాలు ఘటన గురించి తన కుటుంబానికి తెలియజేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎఫ్ ఐఆర్ నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఘటనపై దర్యాప్తునకు మహిళా ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసినట్టు రత్నగిరి ఎస్పీ వెల్లడించారు. బాధితురాలు ఓ ప్రభుత్వ దవాఖానలో కోలుకుంటున్నది. దోషికి ఉరి శిక్ష విధించాలని బాధితురాలు పనిచేస్తున్న దవాఖాన నర్సులు, సిబ్బంది, స్థానికులు డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించి రోడ్లను దిగ్బంధించారు. ఇటీవలే బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే.

రైల్వే బోర్డుకు తొలి దళిత సారథి

చైర్మన్, సీఈఓగా సతీశ్ కుమార్ నియామకం

న్యూఢిల్లీ: రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీశ్ కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్) అధికారి. ఈ బోర్డు చరిత్రలో చైర్మన్, సీఈఓ పదవిని చేపట్టబోతున్న తొలి దళితునిగా ఆయన రికార్డు సృష్టించారు. రైల్వే బోర్డు ప్రస్తుత చైర్‌పర్సన్, సీఈఓ జయ వర్మ సిన్హా ఈ నెల 31న పదవీ విరమణ చేస్తారు. వచ్చే నెల 1 నుంచి సతీశ్ కుమార్ ఆ బాధ్యతలను చేపడతారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

ఎన్ఎస్‌జీ చీఫ్‌గా శ్రీనివాసన్ నియామకం

న్యూఢిల్లీ: నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్‌గా బీ శ్రీనివాసన్ మంగళవారం నియమితులయ్యారు. ఆయన 1992 బ్యాచ్ బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. క్యాబినెట్ నియామకాల కమిటీ ఆయన నియామకానికి ఆమోదం తెలిపింది. ఆయన ఈ పదవిని చేపట్టినప్పటి నుంచి పదవీ విరమణ తేదీ 2027 ఆగస్ట్ 31 వరకు ఈ పదవిలో కొlసాగవచ్చు. సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలను జారీ చేసింది.

కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు వచ్చే నెల 3 వరకు పొడిగించింది. ఆయన కస్టడీ గడువు ముగియడంతో మంగళవారం ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ జడ్జి కావేరీ బవేజా సమక్షంలో హాజరుపరిచారు. సీబీఐ సమర్పించిన అనుబంధ చార్జిషీటును విచారణకు స్వీకరించడంపై వాదనలను కోర్టు వింటున్నది.

రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవ ఎన్నిక

పెద్దల సభలో మెజారిటీని అందుకున్న ఎన్డీఏ

న్యూఢిల్లీ, ఆగస్టు 27: రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో తొమ్మిది మంది బీజేపీ సభ్యులు కాగా, ఎన్డీఏ మిత్రపక్షాలైన ఎన్సీపీ(అజిత్ పవార్) నుంచి ఒకరు, రాష్ట్రీయ లోక్‌మంచ్ నుంచి ఒకరు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఒకరు ఎన్నికయ్యారు. బీజేపీ తరపున అస్సాం నుంచి మిషన్ రంజన్ దాస్, రామేశ్వర్ తేలి, బీహార్ నుంచి మనన్ కుమార్ మిశ్రా, హర్యానా నుంచి కిరణ్ చౌదరి, మధ్యప్రదేశ్ నుంచి జార్జ్ కురియన్, మహారాష్ట్ర నుంచి ధైర్యశీల్ పాటిల్, ఒడిశా నుంచి మమతా మహంత, రాజస్థాన్ నుంచి రవ్‌నీత్ సింగ్ బిట్టు, త్రిపుర నుంచి రాజీవ్ భట్టాచార్య రాజ్యసభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ తరపున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వి, ఎన్సీపీ తరపున మహారాష్ట్ర నుంచి నితిన్ పాటిల్, ఆర్ఎల్ఎం తరపున బీహార్ నుంచి ఉపేంద్ర కుశ్వాహ ఏకగ్రీవంగా గెలుపొందారు. 245 స్థానాలుండే రాజ్యసభలో ప్రస్తుతం 237 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీ సాధించడానికి 119 సభ్యులు అవసరం. కొత్త సభ్యుల ఎన్నికతో బీజేపీ బలం 96కు, ఎన్డీఏ బలం 121కు చేరడంతో మెజారిటీ మార్కును అందుకుంది. ప్రతిపక్ష పార్టీల రాజ్యసభ సభ్యుల సంఖ్య 85గా ఉంది.

కెనడాలో భారత విద్యార్థుల నిరసనలు

- సుమారు 70 వేల మంది విదేశీ విద్యార్థులు దేశం వీడాల్సిన పరిస్థితి
- వలస విధానాల్లో మార్పులే కారణం
- ఆందోళనకు దిగిన విదేశీ విద్యార్థులు

న్యూఢిల్లీ: కెనడాలో ఇటీవల వలస (ఇమ్మిగ్రేషన్) విధానాలను మార్చడంతో 70 వేల మందికిపైగా అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఆ దేశాన్ని వదిలి వెళ్లాల్సిన ముప్పు తలెత్తింది. వీరిలో భారత విద్యార్థులే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. స్టడీ పర్మిట్లపై పరిమితి విధించాలని, శాశ్వత నివాస దరఖాస్తులను (పర్మినెంట్ రెసిడెన్సీ నామినేషన్లను) తగ్గించాలని జస్టిన్ ట్రుడో ప్రభుత్వం నిర్ణయించడంతో వారికి ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో కొత్త జీవితాన్ని నిర్మించుకోవాలని ఎన్నో ఆశలతో కెనడాలో అడుగు పెట్టిన భారతీయులతో సహా, విదేశీ విద్యార్థులంతా ఇప్పుడు అక్కడ నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ఈ ఏడాది చివరికి చాలా మంది అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ల వర్క్ పర్మిట్ల గడువు ముగియనున్నదని, దీంతో వారంతా స్వదేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థుల ప్రతినిధులు చెప్పారు.

విదేశీ విద్యార్థుల సంఖ్యపై ఆస్ట్రేలియా పరిమితులు!

కాన్‌బెర్రా, ఆగస్టు 27: వలసలను నియంత్రించే క్రమంలో విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి విధించాలని ఆస్ట్రేలియా భావిస్తున్నది. వచ్చే ఏడాది వీరి సంఖ్యను 2.70 లక్షలకు పరిమితం చేయాలని యోచిస్తున్నది. యూనివర్సిటీల్లో 1.45 లక్షలు, స్కిల్ ట్రైనింగ్ విభాగంలో 95 వేల మంది విదేశీ విద్యార్థులను అనుమతించేలా పరిమితులు విధించనున్నామని ఆస్ట్రేలియా విద్యా మంత్రి జాసన్ క్లేర్ తెలిపారు. దీనిపై యూనివర్సిటీస్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ లాయిడ్ అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతుందని చెప్తూ విశ్వవిద్యాలయాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల విద్యార్థి వీసాలు మంజూరు కావడం గమనార్హం. కొవిడ్ సమయంలో ఏర్పడిన కార్మికుల కొరతను భర్తీ చేసేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం భారీగా వలసలను ప్రోత్సహించింది. అయితే గృహ సంక్షోభం వేళ భారీగా వలసలు పెరగడంతో మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో విద్యార్థి, నిపుణుల వలసలను సగానికి తగ్గించాలని ఆస్ట్రేలియా ప్రయత్నిస్తున్నది.

వారికి శాశ్వత నివాస హోదా కల్పనకు బ్రేక్

అమెరికా పౌరుల జీవిత భాగస్వాములపై బైడెన్ నిర్ణయాన్ని నిలిపివేసిన కోర్టు

హ్యూస్టన్, ఆగస్టు 27: అమెరికా పౌరులను వివాహం చేసుకున్న అక్రమ వలసదారులకు శాశ్వత నివాస హోదా కల్పించాలనుకున్న బైడెన్ ప్రభుత్వ నిర్ణయానికి టెక్సాస్ కోర్టు బ్రేకులు వేసింది. అమెరికా పౌరులను వివాహం చేసుకున్న భారతీయులు సహా ఇతర దేశాల వారు, వారి పిల్లలకు పర్మినెంట్ రెసిడెన్సీ వేగంగా కల్పించాలని బైడెన్ ప్రభుత్వం జూన్‌లో నిర్ణయించింది. కనీసం పదేండ్లుగా అమెరికాలో నివసించే వారికి ఈ అవకాశం ఇవ్వాలనుకుంది. వీరికి అమెరికా పౌరసత్వం కూడా వేగంగా కల్పించాలని ప్రభుత్వం భావించింది. అయితే, టెక్సాస్ జిల్లా జడ్జి జే కాంప్‌బెల్ బార్కర్ సోమవారం ఈ నిర్ణయంపై రెండు వారాల పాటు స్టే విధించారు. ఈ నిర్ణయం వేల మంది ఇండియన్ అమెరికన్లపై ప్రభావం చూపనుంది.

ఖర్గే కుమారుడిని బర్తరఫ్ చేయండి

- ఖర్గే ట్రస్టుకు భూకేటాయింపు కుంభకోణంపై చర్య తీసుకోండి
- కర్ణాటక గవర్నర్‌కు బీజేపీ వినతి
- సీబీఐ విచారణ జరిపించాలని, ఖర్గే రాజీనామా చేయాలని డిమాండ్

బెంగళూరు: కర్ణాటక మంత్రివర్గం నుంచి ప్రియాంక్ ఖర్గేను బర్తరఫ్ చేయాలని, ఖర్గే ట్రస్టుకు అక్రమ భూ కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు మంగళవారం గవర్నర్‌ను కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్టుకు బెంగళూరు సమీపంలోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్కులో కర్ణాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి మండలి(కేఐఏడీబీ) ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. ఇక్కడ స్థలం కోసం అనేక సంస్థలు, కంపెనీలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సిద్ధరామయ్య ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి ఖర్గేకు చెందిన ట్రస్టుకు కేటాయించిందని, ఇది కుంభకోణమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. ఏఐసీసీ అధ్యక్ష పదవికి మల్లికార్జున ఖర్గే, సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని, భూ కేటాయింపుపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

చట్టప్రకారమే భూకేటాయింపు: సిద్ధరామయ్య

ఖర్గే ట్రస్టుకు చట్టప్రకారమే భూమిని కేటాయించినట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. భూమి పొందడానికి ట్రస్టుకు అర్హత ఉందని, అందుకే కేటాయించామని చెప్పారు.

బళ్లారి జైలుకు కన్నడ నటుడు దర్శన్!

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలు నుంచి బళ్లారిలోని జైలుకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఆయన ఫ్యాన్ రేణుక స్వామి హత్య కేసులో ఆయనతోపాటు మరికొందరు నిందితులు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే దర్శన్ రౌడీషీటర్లతో జల్సాగా టీ తాగుతూ, సిగరెట్ కాల్చుతూ ఆనందంగా గడుపుతున్నట్లు ఓ ఫొటో బయటపడింది. అంతేకాకుండా ఆయన జైలు నుంచి వీడియో కాల్ మాట్లాడుతున్నట్లు ఓ వీడియో వైరల్ అయింది. వీటిపై దర్యాప్తు జరిపిన అధికారులు సోమవారం ఈ జైలు చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు తొమ్మిది మందిని సస్పెండ్ చేశారు. దర్శన్‌కు రాజ భోగాలపై మూడు కేసులను నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ బీ దయానంద చెప్పారు. రేణుక స్వామి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ, ఈ జైలులో కస్టడీలో ఉన్నవారిని కూడా ఇతర జైళ్లకు తరలించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

తోడేళ్ల దాడిలో ఏడుగురి మృతి

మరో 26 మందికి గాయాలు

యూపీలో దారుణం

లక్నో: తోడేళ్లు గుంపుగా వచ్చి జరిపిన దాడుల్లో ఏడుగురు మరణించగా, 26 మంది గాయపడ్డారు. మృతుల్లో ఆరుగురు బాలలు ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైయిచ్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. తోడేళ్ల వల్ల ఇండో-నేపాల్ సరిహద్దుల్లోని 30 గ్రామాల ప్రజలు నెల నుంచి కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి, పహరా కాస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సురేశ్వర్ ప్రసాద్ కూడా ఓ తుపాకీ పట్టుకుని రాత్రి సమయంలో ఓ గ్రామానికి కాపలా కాశారు. ఈ తోడేళ్లను పట్టుకునేందుకు అటవీ శాఖ తొమ్మిది మందిని నియమించింది. మూడు తోడేళ్లను పట్టుకుని, లక్నో జంతు ప్రదర్శన శాలకు పంపించారు.

కునోలో మరో చీతా మృతి!

శ్యోపూర్, ఆగస్టు 27: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో మంగళవారం నమీబియన్ మగ చీతా పవన్ మరణించిందని అధికారులు తెలిపారు. పొదల మధ్య నిండుగా ఉన్న కాలువ గట్టున మగ చీతా పవన్ కదలికలు లేకుండా పడి ఉన్నట్టు గుర్తించారు. తలతోపాటు శరీరంలోని సగ భాగం నీటిలో మునిగి ఉన్నట్టు పశువైద్యులు గుర్తించారు. చీతా కళేబరంపై ఎలాంటి గాయాలు కనిపించలేదు. నీటిలో మునగడం వల్లే చీతా మరణించి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు.

ఐఎంఏ చీఫ్ క్షమాపణను అంగీకరించని సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఐఎంఏ చీఫ్ అశోకన్ చెప్పిన బేషరతు క్షమాపణను అంగీకరించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. పతంజలి సంస్థపై ఐఎంఏ దాఖలు చేసిన కేసు విచారణ సమయంలో అశోకన్ ఏప్రిల్ 29న సుప్రీంకోర్టును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వార్తాపత్రికల్లో ప్రచురించిన క్షమాపణ ప్రకటన చాలా చిన్నగా ఉండటంతో కోర్టు తిరస్కరించింది.

క్యాబ్ కోసం 500 పంపండి

సీజేఐ పేరుతో సైబర్ మోసగాడి మెసేజ్

న్యూఢిల్లీ: ప్రముఖుల ఫొటోలను డీపీగా పెట్టుకొని, వారిలా చాట్ చేస్తూ డబ్బులు అడిగే సైబర్ మోసగాళ్లు హద్దు మీరిపోతున్నారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేరుతోనే డబ్బులు అడుగుతున్న వైనం బయటకు వచ్చింది. 'ఎక్స్'లో ఓ నెటిజన్ ఇందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్ షేర్ చేశారు. 'నేను సీజేఐని. అత్యవసరంగా కొలీజియం సమావేశానికి వెళ్తుండగా కన్నాట్ ప్లేస్‌లో ఇరుక్కుపోయాను. క్యాబ్ కోసం రూ.500 పంపగలరా ? కోర్టుకు చేరుకున్న తర్వాత తిరిగి పంపిస్తా' అంటూ మోసగాడు చాట్ చేశాడు. ఇది సీజేఐ దృష్టికి వెళ్లడంతో సుప్రీంకోర్టు సిబ్బంది సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేశారు.

కొవిడ్‌కు సూది రహిత టీకా

న్యూఢిల్లీ: సూదులంటే భయపడేవారికి పరిష్కారం చూపుతూ ముక్కు ద్వారా అందించే కొవిడ్-19 టీకాను గ్రిఫిత్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్న ఈ టీకా వివరాలు నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇది సింగిల్ డోస్ టీకా. దీనిని 'సీడీఓ-7ఎన్-1గా పిలుస్తున్నారు. వ్యాప్తి, రీ ఇన్ఫెక్షన్, కొత్త వేరియంట్ల పుట్టుకను నిరోధించడంలో ఈ టీకా ప్రభావవంతంగా పనిచేస్తుందని డాక్టర్ గ్జియాంగ్ లియూ తెలిపారు. ఈ వ్యాక్సిన్ తయారీ లైసెన్స్‌ను ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్‌కు ఇచ్చారు.

టైప్ 1.5 డయాబెటిస్!

- టైప్ 1 తరహా ఆటోఇమ్యూన్ సమస్య
- టైప్ 2 డయాబెటిస్ లాంటి లక్షణాలు
- యుక్త వయసులో మొదలు
- టైప్ 2గా పొరబడుతున్న వైద్యులు
- త్